వ్యాస కౌముది



# ఆంధ్రుల చిత్రకళ

కర్లపాలెం హనుమంతరావు

సంస్కృతి ఒక మహాజ్వాల అయితే .. కళలు ఆ జ్వాల వేలార్చే జిహ్వలు. సాహిత్యం, సంగీతం, నృత్యం, వాస్తు, శిల్పకళ, చిత్రకళ.. ఇట్లా ఏదైనా సరే ఆ మహాజ్వాల నాలుకలే.

కళకు దేశం, జాతి, మతం, రాజకీయం వంటి భౌతిక అంశాలతో నిమిత్తం ఉంటుందా? ఉండదా? అనే ప్రశ్న వస్తే ఉంటుంది, ఉండదు అన్న రెండూ సరయిన సమాధానాలే అవుతాయి. పరిసరాలతో ప్రభావితం కాకుండా ఏ కళా బాహ్య వస్తువుగా ఉండేందుకు ఆస్కారం లేదు, అట్లాగని పరిసరాలతో పూర్తిగా ప్రభావితమైతే.. తానంటూ ప్రత్యేకంగా సృజించిన విశేషం ఏదీ మిగలదు. మారే ప్రపంచం మధ్య మనుగడ సాగిస్తూనే ఎన్నటికీ మారని ప్రపంచాన్ని సృజించేదే ఉత్తమమైన కళ– అని చెప్పవచ్చు.

ఆంధ్రుల చిత్రకళ అన్న పదం తరచు వింటూ ఉంటాం, దానర్థం ఆంధ్రులు సృజించిన చిత్రకళా? ఆంధ్రలక్షణాలను స్పృజిస్తూ వెలార్చిన కళా వైభవమా? అనే ధర్మసందేహం సహజంగానే వస్తుంది కదా! ఆంధ్రత్వాన్ని చిత్రించే కళనే ఆంధ్రకళ అన్న నిర్వచనానికి కనక కట్టుబటి ఉంటే ఆ ఆంధ్ర చిత్రకళ సృష్టికర్తలు ఒక్క ఆంధ్రులే కాకుండా ఆంధ్రేతరులు కూడా అయివుండవచ్చు అని సులభంగా అర్థం చేసుకోవచ్చు.

ఆంధ్రుల చిత్రకళ ప్రాచీనమైనది. విస్తృతమైనది.

సభ్యతలో, సంస్కారంలో చాలా ముందున్నట్లుగా మనం భావిస్తున్న సమకాలీన కాలాన్ని గమనిస్తే ప్రాంతీయభావాలు ఎంత సంకుచితంగా పెత్తనం చేస్తున్నాయో అర్థమవుతుంది. ఈ లక్షణాలకు భిన్నంగా ఆంధ్రుల చిత్రకళ ప్రాచీనకాలంలో చాఅ విశాలదృక్పథంతో అభివృద్ధి చెందిన కళగా అర్థం చేసుకోవచ్చు. అంటే ఆంధ్రుల చిత్రకళ ఆంధ్రుల చేతనే ఆంధ్రేతర ప్రాంతాలలో వర్థిల్లిన విభాగం ఒకటైతే, ఆంధ్రేతరుల చేత ఆంధ్రుల ప్రాంతాలలో వర్థిల్లనది మరో రకం. మూడవది ఆంధ్రేతరులు ఆంధ్రేతర ప్రాంతాలలో వర్థిల్లచేసిన ఆంధచిత్రకళ. ఇది చాలా విస్తృతమైనది, విశాల దృక్పథంతో కూడుకుని ఉన్నది కూడా.

ఏ కళ ఔన్నత్యమైనా దాని ప్రాచీనత మిదనే ఆధారపడి ఉంటుందన్నది అపోహ . దాని వర్తమాన స్థితిగతులను బట్టే కళ ఔన్నత్యం నిర్ధారణ జరిగేది. ప్రాచీనత, ఉన్నతి రెండూ సమృద్ధిగా ఉన్న కళలు ఉన్నట్లే, ఆ రెండు లక్షణాలు కొరవడ్డ కళలూ ఉండడం కద్దు అదృష్టం కొద్ది ఆంధ్రుల చిత్రకళ మొదటి తరగతి చెందివుంది.

ప్రాచీన వర్తమానాల ఉజ్వలత సరే! మరి, భవిష్యత్తు? అజ్ఞేయం. వాస్తవానికి వస్తే ప్రాచీనాంధ్రదేశం శిల, శిల్పకళల లీలానికేతనం. శిల్పకళ స్థాయిలో చిత్రకళ అభివృద్ధి చెందలేదు, ఆధునికాంధ్రదేశంలోని పరిస్థితి దానికి పూర్తిగా విరుద్ధం. చిత్రకళ వృద్ధికి సమాంతరంగా శిల్పకళ ముందుకు సాగని పరిస్థితి. ఈ పరిస్థితి ఒక్క ఆంధ్రదేశానికే పరిమితం కాదు. యావద్దేశంలోనూ దాదాపు ఇదే స్థితి.

శిల్పకళకు ఆధారం శిల. కాబట్టి దాని జీవిత కాలం దాదాపు శాశ్వతం. చిత్రకళకు ఆధారం వర్ణాలు. కాలక్రమేణా అవి నశించే గుణం కలవి. కాబట్టే ప్రాచీన కాలం నాటి శిల్పాలు కనిపించినంత విరివిగా చిత్రాలు మనకు నేడు కనిపించవు.

ప్రాచీనాంధ్ర చిత్రకళ శాతవాహనుల కాలంలో ( క్రీ.పూ 225 – క్రీ.శ 226) బాగా వికసించినట్లు చరిత్రకారులు చెప్పే మాట. శాతవాహనుల ప్రభ మసకేసేనాటికి ఆంధ్ర చిత్రకారులు అజంతా గుహలు నిర్మించి అందులో చిత్ర కళ అభ్యాసం కొనసాగించినట్లు కథనాలు ఉన్నవి. ఆంధ్రుల సభాశిల్పి చేతుల మీదనే పదవ అజంతా గుహ అభివృద్ధి, అందులో చిత్రకళ అభివృద్ధి కొనసాగినట్లు చరిత్ర చెబుతుంది. అజంతా గుహలు మొత్త 29 . అందులోని 9, 10 గుహలు అత్యంత ప్రాచీనమైనవి. అజంతా గుహల నిర్మాణం క్రీ.పూ ఒకటి, రెండు శతాబ్దాలలో మొదలై, క్రీ.శ 7 శతాబ్దం దాకా సాగినట్లు చెబుతున్న నేపథ్యంలో శాతవాహనుల కాలంలో మొదలయిన ఆంధ్రుల చిత్రకళ గుప్తుల కాలం (క్రీ .శ 225 – 324) దాకా సాగిందని అర్థమవుతుంది. తరువాత వచ్చిన పల్లవుల కాలంలో కూడా .. ముఖ్యంగా మొదటి పల్లవరాజు మహేంద్ర వర్మ హయాములో ఆంధ్రుల చిత్రకళ ఔన్నత్యం అంచులు తాకినట్లు తెలుస్తుంది. సీతన్న వాసాల గుహల్లోనూ, పుదుక్కోట గుహల్లో కూడా ఆంధ్రుల చిత్రకళ వర్ధిల్లినట్లు నమోదైన చరిత్ర ద్వారా మనం అంగీకరించవలసి ఉంది. అజంతా గుహల్లో కనిపించే ఆంధ్ర చిత్రకళకు సీతన్న వాసాల గుహల్లో కనిపించే చిత్రకళకు సామ్యాలు చాలా ఉన్నవి. సీతన్న వాసాల గుహలు జైనులవి.

తరువాతది కాకతీయుల జమానా(క్రీ.శ 1089 నుంచి 1323 వరకు). ఆ హయాము నాటి చిత్రకళ్ల నమూనాలు లభించలేదు. కానీ క్రీడాభిరామం అనే ప్రబంధంలో ఆంధ్రుల చిత్రకళను గురించిన ప్రస్తావనలు కనిపిస్తాయి. బహుశా అప్పటికే ఆ చిత్రకళకు అవసాన దశ ఆరంభమయినట్లుగా భావించుకోవాలి.

క్రీ.శ 1336 నుంచి 1675 వరకు సాగిన విజయనగర రాజుల పాలనలో మిగతా అన్ని కళలకూ పట్టిన ఔన్నత్య దశ ఆంధ్రుల చిత్రకళకు పట్టిందని భావించాలి. ఈ కాలం నాటి ఆంధ్ర చిత్రకళకు ప్రధానంగా లేపాక్షి కేంద్రం. లేపాక్షిలో, హంపిలో, కొన్ని గ్రామ దేవాలయాలలో కనిపించే ఆంధ్రుల చిత్రకళ వైభోగం అంతా ఇంతా కాదు. అయితే లేపాక్షి చిత్రకళలో సీతన్నవాస గుహల, అజంతా గుహల కళాదక్షత కనిపించదు. ఆంధ్రత్వంలోని ఆ కొరతకు లేపాక్షిది దేశీపద్ధతిలో సాగిన శైలి కావడం కారణం కావచ్చును. రూపపుష్టి, భావలాలిత్యం పరంగా ఉన్నత దశలో ఉండే జైన చిత్రకళా శైలి లేపాక్షి బొమ్మలలో ఎక్కువగా కనిపిస్తుంది. కాకపోతే ఆంధ్రుల చేత ఆంధ్రప్రాంతాలలో నిర్మితమై నేటికీ నిలిచివున్న ప్రధాన ప్రాచీన ఆంధ్రకళ ఒక్క లేపాక్షిలోనే మనకిప్పుడు లభ్యమవుతున్నది.

ఆంధ్రుల అజంతా పదవ గుహలో నిర్మించిన మూర్తుల ఆకారం భౌతికమైనది. లేపాక్షి చిత్రాలు దైవరూపాలు. క్రీస్తుకు పూర్వం చలామణిలో ఉన్న వాస్తవవాదం .. క్రీస్తు శకం ఆరంభం అయిన 16 వ శతాబ్ది నాటికి కల్పనావాదం తీసుకున్నది. ఆ రూప పరిణామానికి లేపాక్షి చిత్ర నిర్మాణం సాక్షి. కల్పనావాదాన్ని మెరుగైన వాదంగా భావిస్తున్న కారణంగానే నేటి చిత్రకళకు ప్రాచీన వాస్తవవాది చిత్రకళకు బొత్తిగా సామ్యం కనిపించదు.

విజయనగర రాజ్య అస్తమయంతో పాటే ఆంధ్రుల చిత్రకళకు గ్రహణం పట్టింది. మళ్లీ తెల్లవారి పాలన మధ్యకాలంలో గానీ ఈ గ్రహణం వీడింది కాదు. ఈ పరిస్థితి ఒక్క ఆంధ్రకళకే కాదు.. యావద్దేశ కళారంగానికి వర్తిస్తుంది. మొగలాయీల చిత్రకళ వికాస క్రమం తతిమ్మా భారతీయ చిత్రకళల వికాసానికి అవరోధంగా నిలచింది. చివరికి మొగలుల చిత్రకళా కాంగ్రా శైలి వరకు పరిణతి చెంది స్తంభించిన పరిస్థితులలో బ్రిటిష్ పాలకుల రూపంలో దేశంలోకి పాశ్చాత్య చిత్రకళ కొత్తగా పాదం మోపడం కళారంగాలకు కొంత మేలే చేసింది. ఆధునిక

భారతీయ చిత్రకళ విషయంలోలా కాకుండా అప్పటి పాశ్చాత్య చిత్రకళకు అప్పటి భారతీయ చిత్రకళకు అటు వస్తువులో కాని, ఇటు శిల్పంలో గాని బొత్తిగా పోలికే లేదు. ఈనాడు వ్యాప్తిలో ఉన్న చిత్రకళకు దేశీయం, విదేశీయం అన్న తేడానే లేదు. అది పరిణతి అనుకుంటే పరిణతి. సంకుచితమనుకుంటే సంకుచితం.

భారతీయ చిత్రానికి గీత ప్రధానమైన అంశం. వర్ణ లేపనాలు ( రంగులు అద్దడం ) సమతలంగా ఉన్న కారణంగా ఎత్తు పల్లాలు ద్యోతకం కాకుండా 3 –డైమన్షన్ పద్ధతికి దూరంగా ఉంటుంది. ఇది వాస్తవవాదానికి దూరమైన శైలి. మరో రకంగా చెప్పాలంటే భారతీయ చిత్రకళకు వాస్తవానుభూతి కన్న వ్యంజన ప్రధానమైన అంశం.

పాశ్చాత్య చిత్రకళకు రేఖ ప్రధానం కాదు. అది వర్ణమయంగా ఉంటుంది. ఒకే సమతలమైనప్పటికీ వెలుగు నీడలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం మూలాన చిత్రంలో ఎత్తు పల్లాలు స్పష్టంగా కనిపిస్తూ వాస్తవ దృశ్యం చూస్తున్నట్లే ఉంటుంది. పాశ్చాత్య కళాకారులు చిత్రాలకు తైలవర్ణాలు ఎక్కువ వాడే అలవాటు.

చిత్రకళారంగంలో ఇలాంటి సంధి దశలో కేరళ నుంచి రవివర్మ అనే చిత్రకారుడు పాశ్చాత్యుల చిత్రకళ అభ్యసించిం అచిరకాలంలోనే ప్రసిద్ధ చిత్రకారుడై ట్రెండ్–సెట్టర్ అనిపించుకున్నాడు. భారతీయ వస్తువును పాశ్చాత్య వర్ణశైలిలో చిత్రిస్తూ రవివర్మ గీసే దేవతామూర్తులు సహజంగానే భారతీయులను అమితంగా ఆకర్షించాయి. దేవతామూర్తులను మామూలు మనుషుల రూపాలలో చిత్రించడం ఉత్తమాభిరుచి కాదని విమర్శలు వెలువడ్డా రవివర్మ కీర్తి కాంతులను అవి మసకబార్చలేకపోయాయి.

రవివర్మ శిష్యులలో ఆంధ్రులైన ఆత్మూరి రామ్మోహన రాయలు ప్రసిద్ధులు. పాశ్చాత్య పద్ధతుల్లో మనుషుల రూపపటాలను రాయడంలోను, పౌరాణిక గాథలను చిత్రించే సందర్భంలో తైలవర్ణాలు వాడడంలోను దక్షత ప్రదర్శించారు. ఆంధ్ర వాస్తవ చిత్రకారులలో అప్పట్లో ఆత్మూరివారే అగ్రగణ్యులుగా ప్రసిద్ధులయారు.

పంథొమ్మిదో శతాబ్ది నాలుగో భాగంలో పాశ్చాత్య సంస్కృతి పట్ల అంతటా విరోధ భావం పెల్లుబుకే వేళ సహజంగానే దేశీయవాదుల అభిరుచి ఈ తరహా కళలకు పెడగా మళ్లింది. ముఖ్యంగా వంగ దేశంలో. సాహిత్యరంగంలో రవీంద్రుడి తరహాలో, చిత్రకళారంగంలో అవనేంద్రుడూ, గగనేంద్రుడూ, హావెల్ మహాశయుడూ ఈ నవజాగృతికి ఆయుధానికి ములుకులు. చిత్రకళలో ఈ చైతన్యం ముందు వెల్లివెరిసింది, పాశ్చాత్య శైలులకు ప్రత్యామ్నాయంగా అజంతా, మొగలాయీ, రాజస్థానీ చిత్రకళ శైలులను స్వీకరిస్తూ భారతీయ చిత్రకళలో ఒక గుణాత్మకమైన మార్పు సాధించే ఉద్యమంలో అవనీంద్రనాధ ఠాగూర్ ది అగ్రస్థానం. ఈ నవ్యభారత చిత్రకళకు భారతదేశమంతటా ఠాగూరుకు శిష్యబృందాలు పెరగి ఇది ఒక న్యూ బెంగాల్ స్కూల్ కింద ప్రసిద్ధిచెందింది. అవనీంద్రుని మొదటి తరం శిష్యులలో తెలుగువారు ఎవరూ లేనప్పటికీ తరువాత స్వర్గీయ అనిసెట్టి వెంకట సుబ్బారావుగారు వారి వద్దకు వెళ్లి ఈ చిత్రకళ మెళుకువలు వంటబట్టించుకున్నట్లు చరిత్రలో నమోదు అయివుంది.

ఆధునిక ఆంధ్ర చిత్రకళను ప్రధానంగా మూడు పాయలుగా విభజన చేయవచ్చు. నవ వంగ చిత్ర విధానం, బొంబాయి చిత్రకళ విధానం చివరిది రాయచౌదరి సంప్రదాయం.

ప్రమోద కుమార చట్టోపాధ్యాయ, రమేంద్రనాధ చక్రవర్తి బందరు జాతీయ కళాశాలలో ఉన్న రోజులలో కొంత మందిని నవ వంగ సంప్రదాయ చిత్రకారులగా తీర్చిదిద్దారు. మనకు ఇప్పుడు సుపరిచితమైన అడవి బాపిరాజు, గుర్రం మల్లయ్య, కౌతా రామ్మోహన శాస్త్రి, ఆనంద మోహన శాస్త్రి, కేశవరావు ఈ ఉద్యమం నుంచి కాకలు తీరి వచ్చిన ప్రముఖులే!

నీటి రంగులతో శిల్ప శాస్త్ర సంప్రదాయాలను అనుసరించి పౌరాణిక సన్నివేశాలను చిత్రీకరించడంలో వీరు దిట్టలు. రూపపుష్టి కన్నా భావదృష్టి జాస్తి. కండపుష్టి లేని శరీరాలు, దీర్ఘ నిమీలిత నేత్రాలు, లతాసుకుమారతతో పోటీకి దిగే చేతివేళ్లు.. మర్త్య

లోకవాసులో, ఏ జ్ఞానలోక నివాసులో అనిపించేలా మూర్తులను చిత్రించడంలో వీరు ప్రసిద్ధులు. ధ్యానమయ, జ్ఞానమయ మూర్తిమత్వ చిత్రీకరణ దక్షత వీరి విశిష్టత. యశోధరుడి షడంగాలు వీరికి ప్రమాణాలు. 'రూపభేదాః, ప్రమాణావి భావలావణ్య యోజనం, సాదృశ్యం వర్ణికాంగమితి చిత్ర షడంగకం' – అంటే రూపానికి రూపానికీ మధ్య ఉండే భేదం, రూపంలో ఇమిడి ఉండే భావప్రకటన, ఆకారంలోని కొలతలు, దూరాలూ దగ్గరలూ, సౌందర్య సృష్టి, పోలికలు, రంగులపూతా– ఇవి ఉత్తమ సృష్టికి ప్రధానాంగాలు.. అని అర్థం.

దామెర్ల రామారావు, వరదా వెంకటరత్నం, చామకూర భాష్యకార్లు, చామకూర సత్యనారాయణ, దామెర్ల సత్యవాణి, బుచ్చి కృష్ణమ్మ లాంటి వాళ్లంతా బొంబాయి సంప్రదాయానికి చెందిన ప్రసిద్ధ చిత్రకారులు. బొంబాయి సంప్రదాయంలో పాశ్చాత్య సంప్రదాయం, భారతీయ సంప్రదాయం సమ్మిళితంగా ఉంటాయి. వాస్తవవాదానికి సమీపంగా చిత్రీకరణ సాగుతుంది. నవవంగ చిత్రకారుల చిత్రాలు పరిణామ పరంగా పెద్దవిగా ఉంటాయి. ఈ విభాగంలో ఎక్కువ పేరు తెచ్చుకున్న చిత్రకారుడు దామెర్ల రామారావు. అల్పాయుష్షు కారణంగా తొందరగా కనుమరుగవడం తెలుగు చిత్రకళ దురదృష్టం. వరదా వెంకట రత్నం, రాజాజీల ఆధ్వర్యంలో దామెర్ల రామారావు పేరు మీద రాజమండ్రిలో చిత్రశాల, చత్రవిద్యాలయం కూడా నడవడం విశేషం.

ఆంధ్ర చిత్రకళకు సంపూర్ణమైన కళ తెచ్చిపెట్టింది మూడో సంప్రదాయంగా చెప్పుకునే రాయచౌదరి సంప్రదాయమే! మద్రాసులో దేవీ ప్రసాద రాయచౌదరి గురుత్వం కింద తయారైన అసంఖ్యాకమైన చిత్రకారులంతా ఈ రాయచౌదరి సంప్రదాయానికి చెందిన ప్రతిభావంతులే. నవవంగ సంప్రదాయానికి, పాశ్చాత్య సంప్రదాయానికి కలయిక వంటిది ఈ రాయచౌదరి సంప్రదాయం. ఈ సంప్రదాయంలో రంగులకు ప్రాధాన్యత జాస్తి. నవవంగ సంప్రదాయంలోని దుర్బలత్వాన్ని ఈ రాయచౌదరి సంప్రదాయం పూరించిందని ఒప్పుకోవాలి. మొక్కపాటి కృష్ణమూర్తి, పైడిరాజు. రాంగోపాల్, మాధవపెద్ది గోఖలే, పిలకా నరసింహమూర్తి, కె.శ్రీనివాసులు, పైడిరాజులు ఇదే సంప్రదాయంలో 'దేశీ (Folk) వరవడిని కూడా ప్రవేశపెట్టిన వారు. ఈ దేశీ పద్ధతిలో చిత్రీకరణ సాగించే సిద్ధిపేట రాజయ్యగారిని గురించి ఇప్పుడు బాగా వినిపిస్తున్నది కదా!

ఇక హైదరాబాద్ ఆంధ్రచిత్రకారులలో కొండపల్లి శేషగిరిరావు, వి.మధుసూదనరావు, పి.టి. రెడ్డి ప్రధానులు. ముగ్గురిదీ మూడు రకాల శైలులు. సుప్రసిద్ధ రచయిత ఆచంట జానకిరాం ఎక్కడా శిష్యరికం చెయ్యకుండానే తన స్వంత పంథాలో సాగి కొత్త రకమైన చిత్రకళను సృష్టించారు. ఎప్పుడూ ఎవరి దగ్గరా ఏ మెళుకువలూ నేర్చుకునే ప్రయత్నం చేయకపోయిన తెలుగు తాత్వికులు శ్రీ సంజీవ దేవ్ నీటి రంగులతో సృష్టించే ప్రకృతి చిత్రాలు ఎంతో ప్రత్యేకంగా ఉంటాయి. ఢిల్లీ ఆంధ్రుడు కుమారిల స్వామిదీ ఒక ప్రత్యేకమైన శైలే!

ఇవాళ ప్రపంచమంతటా ఆధునిక చిత్రకళ పేరుతో అర్థ స్పష్టతకు క్లిష్టంగా ఉంటున్న నైరూప్య చిత్రకళ (Abstract Art) ఒకటి మంచి ఊపు చూపిస్తోంది. ఆ రంగంలోనూ ఆంధ్రుడేమీ వెనకబడిలేడు. బి.వి. నరసింహారావు, కరుణారావు ఈ రంగంలో ఎంతో కృషి చేసిన రుషితుల్యులు. దేశ విదేశాలలో ఎస్.వి. రామారావు అనే చిత్రకారుడు అంతులేని ఖ్యాతి గడించారు.

దేవీ ప్రసాదరాయ చౌదరి శిష్యులలోని లక్ష్మయ్య చిత్రాలు కవితామయంగా ఉండి హృదయాలను కదిలింస్తుంటాయి.

కాలం గడుస్తున్న కొద్దీ అంతర్జాతీయంగా అంతర్జాల ప్రభావంతో అన్ని కళల్లో మాదిరిగానే చిత్రకళలోనూ రోజుకో కొత్త మార్పు సంభవించడం సహజపరిణామం. సంప్రదాయాలు, వ్యక్తుల పరంగా ఈనాడు కొనసాగే ఏ కళనైనా నిర్దిష్టంగా నిర్వచించి, చట్రంలో బిగించినట్లు ప్రదర్శించడం అసాధ్యం. ఈ పరిమితులన్నీఈ వ్యాస రచయితకు తెలిసీ ఈ ప్రయాసకు పూనుకోవడానికి కారణం గతించిపోయిన చిత్రకళనంతా ఒక సారి కొత్త జిజ్ఞాసుల దృష్టి ముందు స్థాలీపులాకన్యాయంగా పరచాలనే. అందరు కళాకారుల పేర్లు, అన్ని చిత్రకళల శైలులు ఏకరువు పెట్టడం విజ్ఞానసర్వస్వాలకే వల్ల కాని కార్యం. కనుక ఇందులో కనిపించని ప్రముఖ వ్యక్తులందరికి ఒక వందనం చెపుతూ వ్యాసం ముగిస్తున్నాను.

ప్రముఖ తాత్విక వేత్త సంజీవ దేవ్ ఓ సందర్భంలో అన్నటుగా ఒక్క రాజకీయనాయకులను, చలనచిత్ర నటీనటులను, సంఘ సేవకుల వంటి ప్రముఖులనే కాకుండా వారితో సమాన ఫాయిదాలో ఉండి నిరంతరం సమాజం పోకడలకు రంగు కుంచెలు, కేన్వాసుల వంటి పరికరాలతో రూప భావల కోణంలో శాశ్వతత్వం సమకూర్చే చిత్రకళాకారులను గౌరవించవలసిన అవసరం ఖచ్చితంగా ఉంది. అదృష్టం కొద్ది ఆ విషయంలో రెండు తెలుగుల స్పందనా నిండుగా ఉంది. ఇదే వరవడి ఇంతకు మించిన వురవడిగా భవిష్యత్తులో సైతం సాగుతుండాలని ఆశిస్తూ

స్వస్తి !

★★★★